40శాతం కూడా రుణమాఫీ కాలే

- మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

కరీంనగర్ కలెక్టరేట్, ఆగస్టు 16 : అంకెల గారడీతో రైతులను సీఎం రేవంత్‌రెడ్డి బురిడీ కొట్టిస్తున్నాడని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ విమర్శించారు. శుక్రవారం కరీంనగర్‌లోని ఆయన నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 40శాతం కూడా రుణమాఫీ కాలేదన్నారు.

అబద్ధాలకు రేవంత్‌రెడ్డి అంబాసిడర్: మాజీ ఎమ్మెల్యే సుంకె

అబద్ధాలకు రేవంత్‌రెడ్డి అంబాసిడర్‌గా మారారని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ఎద్దేవాచేశారు. పూడూరులో 680 మంది రైతులుంటే, 142 మందికి మాత్రమే మాఫీ అయినట్టు వివరించారు.

దేవుళ్లపై ఒట్టేసి రైతులకు మోసం: మాజీ మంత్రి జోగు రామన్న

ఆదిలాబాద్, ఆగస్టు 16 (నమస్తే తెలంగాణ) : రూ.2 లక్షల రుణ మాఫీ చేస్తామని దేవుళ్లపై ఒట్టేసి మరీ సీఎం రేవంత్‌రెడ్డి రైతులను మోసం చేశారని మాజీ మంత్రి జోగు రామన్న ఆదిలాబాద్‌లో మండిపడ్డారు.

రుణమాఫీపై చేతులెత్తేసిన సర్కార్: బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

బోథ్, ఆగస్టు 16 : రుణమాఫీ చేయక రేవంత్ సర్కార్ చేతులెత్తేసిందని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మండిపడ్డారు. శుక్రవారం ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండలోని తన నివాసంలో మాట్లాడారు.

తుపాకీ రాముడి మాటలు బంజెయ్: పుట్ట మధూకర్

పెద్దపల్లి, ఆగస్టు 16(నమస్తే తెలంగాణ) : ఇకనైనా సీఎం రేవంత్‌రెడ్డి తుపాకీ రాముడి ముచ్చట్లు బంద్ చేయాలని మాజీ ఎమ్మెల్యేలు పుట్ట మధూకర్, కోరుకంటి చందర్ హితవుపలికారు. శుక్రవారం పెద్దపల్లి బీఆర్ఎస్ కార్యాలయంలో మాట్లాడారు.

హరీశ్‌రావు జోలికొస్తే సహించేది లేదు: ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

సంగారెడ్డి, ఆగస్టు 16(నమస్తే తెలంగాణ): సీఎం రేవంత్‌రెడ్డి ఇక ముందు హరీశ్‌రావు జోలికొస్తే సహించేది లేదని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ హెచ్చరించారు. శుక్రవారం సంగారెడ్డిలో ఎమ్మెల్యే మాణిక్‌రావు, చంటి క్రాంతికిరణ్‌తో కలిసి మాట్లాడారు.

హరీశ్‌రావు వీడియోను ప్రదర్శించిన చంటి క్రాంతికిరణ్

రేవంత్‌రెడ్డికి హరీశ్‌రావు సవాలు చేసిన వీడియోను విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ ప్రదర్శించారు. ఎలాంటి షరతుల్లేకుండా రుణమాఫీ అమలుచేస్తే పదవికి రాజీనామా చేస్తానని హరీశ్ సవాల్ చేశారని కాంత్రికిరణ్ వివరించారు.

రేవంత్‌రెడ్డి ముక్కు నేలకు రాయాలి: మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి

నార్కట్‌పల్లి, ఆగస్టు 16 : రుణమాఫీ అమలులో విఫలమైన రేవంత్‌రెడ్డి ముక్కు నేలకు రాయాలని మాజీ ఎమ్మెల్యే లింగయ్య డిమాండ్ చేశారు.

కేసీఆర్‌ను విమర్శించే స్థాయి నీకు లేదు : ఎమ్మెల్సీ కోటిరెడ్డి

మిర్యాలగూడ, ఆగస్టు 16 : కేసీఆర్‌ను విమర్శించే స్థాయి రేవంత్‌రెడ్డికి లేదని ఎమ్మెల్సీ మంకెన కోటిరెడ్డి మిర్యాలగూడలో విమర్శించారు.

కేసీఆర్ ఆరోగ్యంపై కాంగ్రెస్ దుష్ప్రచారం

- ప్రజల దృష్టిని మళ్లించేందుకు కేసీఆర్‌కు అస్వస్థత అంటూ తప్పుడు కథనాలు వ్యాప్తి
- పార్టీ క్యాడర్‌తో, వ్యవసాయ పనులతో నిత్యం కేసీఆర్ బిజీబిజీ
- 12 రోజులుగా అస్వస్థత అయితే నేతలను ఎలా కలుస్తున్నరు?

హైదరాబాద్, ఆగస్టు 16 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కే చంద్రశేఖర్‌రావు ఆరోగ్య పరిస్థితిపై కాంగ్రెస్ దుష్ప్రచారానికి పాల్పడుతున్నది. సంపూర్ణ ఆరోగ్యంగా ఉన్న కేసీఆర్‌పై తీవ్ర అస్వస్థత ముద్రవేసే పన్నాగానికి తెరతీసింది. నిత్యం పార్టీ శ్రేణులతో భవిష్యత్ కార్యాచరణపై సమాలోచనలు జరుపుతూ, వ్యవసాయ క్షేత్రంలో వ్యవసాయ పనులతో బిజీబిజీగా గడుపుతున్న నేతకు అనారోగ్యం అంటూ దుష్ప్రచారానికి దిగింది. ప్రజల దృష్టిని మళ్లించేందుకు కేసీఆర్‌కు తీవ్ర ఆస్వస్థత అంటూ ప్రచారం చేస్తున్నదనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది. కాంగ్రెస్ సోషల్ మీడియా వేదికగా 12 రోజులుగా కేసీఆర్ అస్వస్థతకు గురయ్యారని, యశోద దవాఖాన బృందం గజ్వేల్‌లో ఎమర్జెన్సీ యూనిట్‌ను నెలకొల్పి 24 గంటలు పర్యవేక్షిస్తున్నదని ప్రచారం చేస్తున్నది.

12 రోజులుగా తీవ్ర అస్వస్థతకు గురైతే...

రాష్ట్ర గిరిజన కార్పొరేషన్ మాజీ చైర్మన్ వాల్యానాయక్ కుటుంబ సమేతంగా బుధవారం కేసీఆర్‌ను కలిసి, తన కుమారుడి వివాహానికి రావాల్సిందిగా ఆహ్వానించారు. వరంగల్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి గురువారం తన పుట్టినరోజు సందర్భంగా కేసీఆర్‌ను కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. కేసీఆర్ 12 రోజులుగా తీవ్ర అస్వస్థతకు గురైతే ఇవి సాధ్యపడ్తాయా? అని బీఆర్ఎస్ శ్రేణులు ప్రశ్నిస్తున్నాయి.

మాజీ సీఎం కేసీఆర్‌కు మొక్కను అందజేస్తున్న వరంగల్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి

కేసీఆర్ స్ఫూర్తితో ఆమరణ దీక్ష

- కులగణన చేయకుంటే ఊరుకోం
- 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాల్సిందే
- బీసీ సంఘాల నేతల స్పష్టీకరణ
- కామారెడ్డి డిక్లరేషన్ అమలు చేయాల్సిందే
- ఆర్ కృష్ణయ్య, రాజారాంయాదవ్ డిమాండ్

సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న ఆర్ కృష్ణయ్య

ఖైరతాబాద్, ఆగస్టు 16: బీసీ కులగణన, 42 శాతం రిజర్వేషన్ల సాధన కోసం తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ స్ఫూర్తితో ఆమరణ దీక్ష చేపడుతామని బీసీ సంఘాల నాయకులు స్పష్టంచేశారు. హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బీసీ కుల, విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం మీడియా సమావేశంలో ఎంపీ, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య, బీసీ జనసభ రాష్ట్ర అధ్యక్షులు రాజారాం యాదవ్ మాట్లాడారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌కు కాంగ్రెస్ కట్టుబడి ఉండాలని వారు డిమాండ్ చేశారు. కులగణన చేయకుండా ప్రభుత్వం సాకులు చెబితే ఊరుకునే ప్రసక్తే లేదని ఆర్ కృష్ణయ్య స్పష్టం చేశారు. తన ఆరోగ్యం బాగాలేకున్నా సామూహిక ఆమరణ దీక్షలో పాల్గొంటానని చెప్పారు. అధికార పార్టీలో ఉన్న బీసీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర పార్టీల ప్రజాప్రతినిధులు సమగ్ర కులగణనపై ఆయా పార్టీలపై ఒత్తిడి తేవాల్సిన అవసరం ఉన్నదని హితవు పలికారు. 42 మంది బీసీ నేతలతో సామూహిక ఆమరణ దీక్ష చేపడుతామని చెప్పారు.

అసమానతలు తగ్గించటానికి వర్గీకరణ తోడ్పాటు

- సాకారమైన మంద కృష్ణ పోరాటం: పొన్నాల

హైదరాబాద్, ఆగస్టు 16 (నమస్తే తెలంగాణ): సమాజంలో అట్టడుగు వర్గాల అభ్యున్నతికి ఎస్సీ వర్గీకరణ దోహదం చేస్తుందని మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణ కోసం మందకృష్ణ మాదిగ చేసిన పోరాటం స్ఫూర్తివంతమైనదని తెలిపారు. ఆయన పోరాటం ఫలించిందని చెప్పారు. హైదరాబాద్‌లోని పొన్నాల లక్ష్మయ్య నివాసానికి శుక్రవారం మందకృష్ణ వెళ్లారు. మర్యాద పూర్వకంగా ఆయనతో భేటీ అయ్యారు. అనంతరం పొన్నాల లక్ష్మయ్య మాట్లాడుతూ 1993 నుంచి తనకు వ్యక్తిగతంగా మంద కృష్ణమాదిగ తెలుసన్నారు. అన్ని వర్గాలు సమాంతరంగా పురోగమించిన సమాజమే ప్రగతిశీల సమాజమని రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పేర్కొన్నారని, అందుకు అణగారిన వర్గాలకు రిజర్వేషన్లు అనివార్యమని సూచించారని ఉదహరించారు.

రేవంత్‌రెడ్డిది నడుమంత్రపు సిరి

- మాజీ ఎంపీ బాల్క సుమన్ ఫైర్

మాట్లాడుతున్న బాల్క సుమన్

హైదరాబాద్, ఆగస్టు 16 (నమస్తే తెలంగాణ) : 'కేసీఆర్, హరీశ్‌రావుతో నీకు పోలికా? ముఖ్యమంత్రి స్థాయికి తగ్గట్టు మాట్లాడు' అంటూ రేవంత్‌రెడ్డిపై మాజీ ఎంపీ బాల్క సుమన్ ఫైర్ అయ్యారు. హరీశ్‌రావుపై రేవంత్ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని చెప్పారు. తెలంగాణభవన్‌లో శుక్రవారం ఆయన మీడియా మాట్లాడారు. రుణమాఫీ మోసాన్ని పక్కదారి పట్టించేందుకే కేసీఆర్, హరీశ్‌రావుపై రేవంత్‌రెడ్డి ఇష్టారీతిన మాట్లాడారని మండిపడ్డారు. రైతు రుణమాఫీ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని వదిలిపెట్టేది లేదని, భరతం పడతామని హెచ్చరించారు. రేవంత్‌రెడ్డి దావోస్, అమెరికా పర్యటనల్లో వచ్చిన పెట్టుబడులపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. 4వేల పింఛన్ ఇవ్వనందుకు, స్కూటీలు ఇవ్వనందుకు, రైతులను వంచించినందుకు, ఇచ్చిన హామీలను అమలు చేయనందుకు రేవంత్‌రెడ్డే నీళ్లలో దూకాలని దుయ్యబట్టారు. అంబేద్కర్‌ను రేవంత్‌రెడ్డి అవమానిస్తున్నాడని, నెక్లెస్ రోడ్డులోని అంబేద్కర్ అతిపెద్ద విగ్రహం వద్ద వసతులు కల్పించకుండా వదిలేశారని విమర్శించారు. రేవంత్‌రెడ్డిది నడుమంత్రపు సిరి అని, జాక్‌పాట్‌లో సీఎం అయ్యారని, ఇదే ఆయనకు చివరి పదవి అని, భవిష్యత్తులో ఇక ఏ పదవీ వచ్చేది లేదని చెప్పారు. రేవంత్‌రెడ్డికి దమ్ము, చిత్తశుద్ధి ఉంటే పనితీరులో పోటీ పడాలని సూచించారు. బీఆర్ఎస్ ఏ పార్టీలో విలీనం కాదని, బలమైన పార్టీ అని, మరో 50 ఏండ్లు బలంగా ఉండేందుకు పార్టీ నాయకత్వం అన్ని చర్యలు తీసుకుంటున్నదని చెప్పారు. త్వరలోనే బలమైన ప్రాంతీయ పార్టీలున్న రాష్ట్రాల్లో పర్యటించి అక్కడ అధ్యయనం చేస్తామని తెలిపారు. మీడియా సమావేశంలో శాట్స్ మాజీ చైర్మన్ అంజనేయగౌడ్, బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్, ఉపాధ్యక్షుడు బాలు పాల్గొన్నారు.

సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులు అర్పిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, కమిటీ చైర్మన్ బాల్‌రాజ్‌గౌడ్ తదితరులు..

పాపన్న స్ఫూర్తితో బహుజనులు ఏకంకావాలి

- రాజ్యాధికారమే అంతిమ లక్ష్యం కావాలి
- పాపన్న జీవితం యువతకు స్ఫూర్తిదాయకం
- సర్దార్ పాపన్న జయంతి వేడుకల్లో వక్తలు
- హైదరాబాద్‌లో మంత్రిపొన్నం, ఎంపీ ఈటల హాజరు

హైదరాబాద్, ఆగస్టు16 (నమస్తే తెలంగాణ)/చిక్కడపల్లి: సర్దార్ సర్వాయి పాపన్నను స్ఫూర్తిగా తీసుకుని బహుజనులంతా ఏకం కావాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. రాజ్యాధికారమే అంతిమ లక్ష్యంగా ముందుకు సాగాలని వారు పిలుపునిచ్చారు. బహుజన విప్లవవీరుడు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ 374వ జయంతి ఉత్సవాలను శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం అధికారికంగా నిర్వహించింది. కల్లుగీత కార్మిక, గౌడ, బీసీ సంఘాల ఆధ్వర్యంలోనూ పాపన్న జయంతి ఉత్సవాలు జరిగాయి. ఆయా చోట్ల పాపన్న చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బహుజన రాజ్యం కోసం పాపన్న చేసిన పోరాటాన్ని నేతలు స్మరించుకున్నారు. హైదరాబాద్ చిక్కడపల్లిలో తెలంగాణ గౌడ కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో పాపన్న జయంతి సభను ఘనంగా నిర్వహించారు. కమిటీ చైర్మన్ బాలగౌని బాల్‌రాజ్‌గౌడ్ అధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్, ఎంపీ ఈటెల రాజేందర్, ఎమ్మెల్యే ముఠా గోపాల్, మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, శాసన మండలి మాజీ చైర్మన్ కే స్వామి గౌడ్, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్, మాజీ ఎంపీ హన్మంతరావు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్, బసీ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్‌గౌడ్, మాజీ ఐఏఎస్ చిరంజీవులు పాల్గొని పాపన్న విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సభలో మంత్రి పొన్నం మాట్లాడుతూ సర్వాయి సర్వాయి పాపన్నగౌడ్ జీవితం నేటి యువతకు స్ఫూర్తిదాయకమని కొనియాడారు. పాపన్న విగ్రహం చూడగానే కర్తవ్యం గుర్తుకురావాలని ఈటల రాజేందర్ పిలుపునిచ్చారు. పాపన్నగౌడ్ సాహసానికి మారుపేరు అని కొనియాడారు. బీసీలంతా ఏకం కావాలని కోరారు. సమావేశంలో కమిటీ రాష్ట్ర కన్వీనర్ అయిలి వెంకన్నగౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎలికట్టె విజయ్‌కుమార్‌గౌడ్, వైస్ చైర్మన్ గడ్డమీది విజయ్‌కుమార్‌గౌడ్, వెంకటేశ్‌గౌడ్, గణేశ్‌చారి, అంబాల నారాయణగౌడ్, ఎంవీ రమణ, అంబాల నారాయణగౌడ్, గాయకులు రామలింగం, ఎపూరు సోమన్న తదితరులు పాల్గొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా జరిగిన వేడుకల్లో నేతలు జకే వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

కాళేశ్వరం లింక్-2లో కొనసాగుతున్న ఎత్తిపోతలు

ధర్మారం/రామడుగు/బోయినపల్లి/ఇల్లంతకుంట, ఆగస్టు 16: కాళేశ్వరం ప్రాజెక్టు లింక్-2లో ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. పెద్దపల్లి జిల్లాలోని శ్రీపాద ఎల్లంపల్లి జలాశయం నుంచి అండర్ టన్నెళ్ల ద్వారా ధర్మారం మండలం నందిమేడారంలోని నంది పంప్‌హౌస్‌కు జలాలు చేరుతుండగా, శుక్రవారం 5వ నంబర్ మోటర్ ద్వారా 3,150 క్యూసెక్కుల నీటిని నంది రిజర్వాయర్‌లోకి ఎత్తిపోస్తున్నారు. అక్కడి నుంచి జంట సొరంగాల ద్వారా కరీంనగర్ జిల్లా రామడుగు మండలం లక్ష్మీపూర్‌లోని గాయత్రీ పంప్‌హౌస్‌కు తరలిపోతున్నాయి. ఇక్కడ 5వ నంబర్ మోటర్ ద్వారా 3,150 క్యూసెక్కుల నీటిని శ్రీ రాజరాజేశ్వర జలాశయానికి తరలిస్తున్నారు. శుక్రవారం సాయంత్రం వరకు ఎల్లంపల్లి నుంచి 14.6 టీఎంసీలకు పైనే జలాలు మధ్య మానేరుకు తరలించినట్టు ప్రాజెక్టు అధికారులు తెలిపారు. మధ్యమానేరు జలాశయంలో 27.54 టీఎంసీల నీటి సామర్థ్యానికిగాను ప్రస్తుతం 15.58 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు అధికారులు తెలిపారు. మధ్యమానేరు నుంచి సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం అనంతగిరిలోని అన్నపూర్ణ జలాశయం వైపు నీటిని తరలిస్తున్నారు. మధ్యమానేరు నుంచి అండర్ టన్నెళ్ల ద్వారా తిప్పాపూర్‌లోని సర్జ్‌పూల్‌కు జలాలు చేరుతుండగా, పంప్‌హౌస్‌లో రెండు బాహుబలి మోటర్ల ద్వారా 6,440 క్యూసెక్కులు అన్నపూర్ణ జలాశయానికి తరలిస్తున్నారు. ఇక్కడ జలాశయం గేట్లు తెరిచి అంతే మొత్తంలో రంగనాయక సాగర్‌కు గ్రావిటీ కెనాల్ ద్వారా వదులుతున్నారు. అన్నపూర్ణ జలాశయంలో 3.5 టీఎంసీల సామర్థ్యానికిగాను ప్రస్తుతం 1.25 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్టు అధికారులు తెలిపారు.

రాజన్నసిరిసిల్లజిల్లా అన్నపూర్ణ ప్రాజెక్టులోకి కాళేశ్వరం నీటిని ఎత్తిపోస్తున్న బాహుబలి మోటర్లు

సాగర్ నాలుగు క్రస్టు గేట్ల ద్వారా కొనసాగుతున్న నీటి విడుదల

సాగర్‌కు 32,400 క్యూసెక్కుల వరద

- నాలుగు గేట్ల ద్వారా సాగర్ నీటి విడుదల

నందికొండ, ఆగస్టు 16 : శ్రీశైలం నుంచి ఇన్‌ఫ్లో కొనసాగుతుండటంతో నాగార్జునసాగర్ డ్యామ్ నాలుగు క్రస్టు గేట్ల ద్వారా నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి 79,617 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండటంతో అదే స్థాయిలో అవుట్ ఫ్లో కొనసాగిస్తున్నారు. సాగర్ నీటిమట్టం 590 అడుగులకు ప్రస్తుతం పూర్తిస్థాయిలో నిండింది. క్రస్టు గేట్ల ద్వారా 32,400, ఎడమ కాల్వ ద్వారా 7,518, కుడి కాల్వ ద్వారా 8,067, ప్రధాన జలవిద్యుత్తు కేంద్రం ద్వారా 29,232, వరద కాల్వ ద్వారా 600, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1,800 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.

మేడిగడ్డకు 1,57,690 క్యూసెక్కుల వరద

మహదేవపూర్/కన్నాయిగూడెం,ఆగస్టు 16 : జయశంకర్‌భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం మేడిగడ్డ బరాజ్‌కు 1,57,690 క్యూసెక్కుల ప్రవాహం వచ్చింది. మొత్తం 85 గేట్లను ఎత్తి అంతే మొత్తంలో నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. రివర్ బెడ్ నుంచి వరద 90.80 మీటర్లుగా ఉంది. ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం తుపాకులగూడెం సమ్మక్క బరాజ్ వద్ద 1,85,780 క్యూసెక్కుల వరద వస్తున్నది. 59 గేట్లను ఎత్తి నీటిని వదులుతున్నారు. బరాజ్ పూర్తిస్థాయి నీటిమట్టం 83 మీటర్లు కాగా 75.40 మీటర్లకు చేరుకున్నది. దేవాదుల ఎత్తిపోతల ప్రాజెక్టు ఫేస్-3లో మూడు మోటర్లతో నీటి పంపింగ్ కొనసాగుతున్నది. 875 క్యూసెక్కుల నీటిని భీంఘనపురం రిజర్వాయర్‌కు తరలిస్తున్నట్టు డీఈ శరత్, ఏఈఈ సాయిరాం తెలిపారు.

డ్రగ్స్ మురా అరెస్టు

- నిందితుల్లో ముగ్గురు విక్రేతలు, ఐదుగురు కొనుగోలుదారులు
- రూ.4.65 కోట్ల విలువైన సొత్తు స్వాధీనం చేసుకున్న పోలీసులు

వివరాలను వెల్లడిస్తున్న మాదాపూర్ డీసీపీ వినీత్, ఎస్వోటీ డీసీపీ శ్రీనివాస్

శేరిలింగంపల్లి, ఆగస్టు 16: హైదరాబాద్‌లో మాదకద్రవ్యాల క్రయవిక్రయాలు జరుపుతున్న ఓ ముఠాను ఎస్వోటీ మాదాపూర్, రాయదుర్గం పోలీసులు అరెస్టు చేశారు. పట్టుబడ్డవారిలో డ్రగ్ పెడ్లర్లు దినేశ్ చౌదరి (సైనిక్‌పురి), గణేశ్ చౌదరి (ఘట్‌కేసర్), మంగళ రామ్ (రాజస్థాన్)తోపాటు డ్రగ్స్ కొనుగోలుదారులు నితిన్ గుర్జార్ (గచ్చిబౌలి టెలికం నగర్), ప్రకాశ్ చౌదరి (సైదాబాద్), జైవట్రం వస్నరామ్ దేవసి (అమీన్‌పూర్), దినేశ్ చౌదరి (సైనిక్‌పురి), బనారామ్ చౌదరి (భువనగిరి) ఉన్నట్టు మాదాపూర్ డీసీపీ జీ వినీత్, ఎస్వోటీ డీసీపీ శ్రీనివాస్ శుక్రవారం మీడియాకు వెల్లడించారు. నిందితుల నుంచి 620 గ్రాముల హెరాయిన్ పేస్ట్, మహీంద్రా ఎక్స్‌యూవీ కారు, 7 సెల్‌ఫోన్లు సహా మొత్తం రూ.4.65 కోట్ల విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. నిందితుల్లో ఐదుగురికి డ్రగ్స్ టెస్టులో పాజిటివ్ వచ్చినట్టు చెప్పారు. గచ్చిబౌలి టెలికాంనగర్‌లోని గణేశ్ చౌదరికి చెందిన లైట్‌హౌజ్ ఎలక్ట్రికల్ షాపులో డ్రగ్స్ క్రయవిక్రయాలు జరుపుతుండగా వీరిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించామని, రాజస్థాన్‌కు చెందిన ప్రధాన నిందితుడు సావర్ జాట్ పరారీలో ఉన్నాడని వివరించారు. మీడియా సమావేశంలో మాదాపూర్ అడిషనల్ డీసీపీ జయరాం, ఎస్వోటీ అడిషనల్ డీసీపీ శ్రీనివాస్‌రెడ్డి, మాదాపూర్ ఏసీపీ శ్రీకాంత్, రాయదుర్గం ఇన్‌స్పెక్టర్ సీహెచ్ వెంకన్న పాల్గొన్నారు.

డ్రగ్స్ తరలిస్తున్న ఇద్దరి అరెస్టు

హైదరాబాద్, ఆగస్టు 16 (నమస్తే తెలంగాణ) : బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు డ్రగ్స్ తరలిస్తున్న ఇద్దరిని ఎస్టీఎఫ్ అదుపులోకి తీసుకున్నట్టు ఎక్సైజ్‌శాఖ జాయింట్ కమిషనర్ ఖురేషి తెలిపారు. మరో కేసులో 1,200 కిలోల బెల్లం, 50 కిలోల పటిక స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. శుక్రవారం ఆబ్కారీ భవన్‌లో వివరాలు వెల్లడించారు. కర్ణాటకకు చెందిన పీవీ రాహుల్, మహేశ్ కూకట్‌పల్లికి చెందిన పలువురికి 29.6 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్స్ తీసుకొస్తుండగా ఎస్టీఎఫ్ డీఎస్పీ శ్రీనివాసరావు పర్యవేక్షణలో పట్టుబడినట్టు తెలిపారు. నితిన్‌రెడ్డి, నైజీరియాకు చెందిన జాక్సన్ ప్రమేయం ఉందని చెప్పారు. డ్రగ్స్ విలువ రూ.4.50 లక్షలు ఉంటుందని తెలిపారు. కొల్లాపూర్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో పెద్దకొత్తపల్లికి కర్ణాటక నుంచి బొలెరోలో తరలిస్తున్న లక్షన్నర విలువైన బెల్లం, పటిక స్వాధీనం చేసుకున్నట్టు వెల్లడించారు. అడిషనల్ ఎస్పీ భాస్కర్, డీఎస్పీలు శ్రీనివాసరావు, తిరుపతి, ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎస్టీఎఫ్ ప్రదీప్‌రావు ఉన్నారు.

- ఖాళీ బిందెలతో మహిళల ధర్నా

నెలరోజులుగా మిషన్ భగీరథ నీళ్లు రావడం లేదని మెదక్ జిల్లా కొల్చారం మండలం నాయినిజలాల్‌పూర్ గ్రామస్థులు శుక్రవారం గ్రామ పంచాయతీ వద్ద ఖాళీబిందెలతో ధర్నాకు దిగారు. తాగడానికి, ఇతర అవసరాలకు నీళ్లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని అన్నారు. పంచాయతీ కార్యదర్శిని నిలదీస్తే తాను వచ్చి నెల రోజులు కూడా కాలేదని తప్పించుకుంటున్నాడని వారు మండిపడుతున్నారు. - కొల్చారం

'గ్రూప్-1' పరీక్ష షెడ్యూల్‌లో స్వల్ప మార్పు

హైదరాబాద్, ఆగస్టు 16 (నమస్తే తెలంగాణ): గ్రూప్-1 మెయిన్ పరీక్షల షెడ్యూల్‌లో స్వల్ప మార్పు చోటు చేసుకుంది. పరీక్షలను అక్టోబర్ 21 నుంచి 27 వరకు నిర్వహించనున్నారు. అయితే పరీక్ష సమయంలో మార్పులు చేస్తూ శుక్రవారం టీజీపీఎస్సీ అధికారులు మరోసారి షెడ్యూల్‌ను విడుదల చేశారు. నిర్ణీత తేదీల్లో మధ్యాహ్నం 2:30 గంటల నుంచి 5:30 గంటల వరకు పరీక్ష నిర్వహించాల్సి ఉంది. కానీ ఆ సమయాన్ని అరగంట ముందుకు జరుపుతూ మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకు పరీక్ష నిర్వహించేలా మార్పులు చేశారు. మెయిన్స్ పరీక్షలకు సంబంధించిన శాంపిల్ ఆన్సర్ బుక్‌లెట్‌ను వెబ్‌సైట్‌లో పెట్టినట్టు టీజీపీఎస్సీ సెక్రటరీ నవీన్‌నికోలస్ ప్రకటన విడుదల చేశారు. హాల్‌టికెట్లకు సంబంధించిన సూచనలు వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసినట్టు అధికారులు పేర్కొన్నారు. హాల్‌టికెట్‌లో సూచించిన అంశాలను అనుసరించాలని వెల్లడించారు. వివరాలకు టీజీపీఎస్సీ వెబ్‌సైట్ ఫాలో కావాలని పేర్కొన్నారు.